

డివిజన్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



నూజివీడు: దిగవల్లిలోని కేఎంఎస్ హైస్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.కిశోర్ తెలిపారు. బాలుర విభాగంలో వాలీబాల్ అండర్-14లో కె.విశ్వనాథ్, ఖోఖో అండర్-14లో డి.రాజ్‌పాల్, బి. మోక్ష, బాలికల విభాగంలో అండర్-14 వాలీబాల్‌లో బి. నవ్య, అండర్-17లో ఎం.లక్ష్మీ జోష్ణవి, జి. కావ్య, సీహెచ్ హారిక, అండర్-14 ఖోఖోలో బి. చంద్రమహేష, అండర్-17లో కీర్తన ఎంపికయ్యారన్నారు.

ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

సబ్ కలెక్టర్ వినూత్న ఆదేశం

నూజివీడు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఆస్పత్రిలోని ఓపీ, ఎమర్జెన్సీ, లేబర్ వార్డు, సర్జికల్ వార్డు, జనరల్ వార్డు, ఫార్మసీ, సిబ్బంది హాజరు పట్టీని, ఇతర రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డుల్లో కొన్ని చోట్ల పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, ఇలాగైతే రోగులు ఆస్పత్రికి ఎలా వస్తారని సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రి పరిసరాలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయని, మరోసారి ఆస్పత్రి విజిట్‌కు వస్తానని, అప్పటికి పారిశుద్ధ్యం మెరుగుపడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

అదాలత్ అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానియేలు

నూజివీడు: విద్యుత్ వినియోగదారుల అదాలత్ ద్వారా వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని అదాలత్ అధ్యక్షుడు ఎస్.విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. నూజివీడులో జీపీ గ్రాండ్ ఆవరణలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి విద్యుత్ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. దీనిలో భాగంగా రెడ్డిగూడెం మండలం రంగాపురానికి చెందిన కుప్పిరెడ్డి అశోక్‌రెడ్డి విద్యుత్ సర్వీసుకు సంబంధించి పేరు మార్చాలని అర్జీని అందజేశారు. ఇలాంటి అదాలత్‌లు ప్రతి ఆరు నెలలకొకసారి నిర్వహించాలని, నిర్వహిస్తున్న విషయాన్ని ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న విక్టర్ ఇమ్మానియేలు

అనంతరం అధ్యక్షుడు ఎస్.విక్టర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ ప్రజల నుంచి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు డి.కృష్ణానాయక్, ఎస్సీ హనుమయ్య, ఆర్థిక సభ్యులు ఆర్ సీహెచ్ శ్రీనివాసరావు, నూజివీడు ఈఈ ఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారావుపాలెం నుంచి ఎయిమ్స్‌కు బస్ సౌకర్యం

చాట్రాయి: మండలంలోని కృష్ణారావుపాలెం నుంచి మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పిస్తున్నామని నూజివీడు డిపో మేనేజర్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5.45 గంటలకు కృష్ణారావుపాలెం నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. ఈనెల 13 నుంచి ఈ బస్సు సర్వీసు అందుబాటులో ఉంటుందని చెప్పారు.

డేటా అనలిటిక్స్ రంగంలో ఎక్కువ అవకాశాలు

మైలవరం: డేటా అనలిటిక్స్ రంగంలో ఎక్కువ అవకాశాలు ఉంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎక్సెల్ ఆర్ ఎడ్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అనుసంధానంతో నిర్వహించిన డేటా అనలిటిక్స్ యూజింగ్ అడ్వాన్స్ ఎక్సెల్ అండ్ పవర్ బీఐ సర్టిఫికెట్ కోర్సు శుక్రవారం ముగిసింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డేటా అనలిటిక్స్ రంగంలో అవకాశాలను విద్యార్థులకు వివరించారు. కోర్సు కన్వీనర్ డాక్టర్ ఎన్. వెంకటాద్రి మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కో-ఆర్డినేటర్ బి.సుభాషిణి, ఫిజికల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ఉమాలక్ష్మి, ఎక్సెల్ఆర్ ఎడిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్గనైజేషన్ నుంచి దుర్గాప్రసాద్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర విధులు బహిష్కరణ

జి.కొండూరు: పాఠశాలల్లో బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించడం వల్ల విద్యా బోధన కుంటుపడి ప్రమాణాలు పడిపోతున్నాయని ఫ్యాప్టో నాయకుడు జి.అనుగ్రహ ప్రసాద్ అన్నారు. ఫ్యాప్టో పిలుపు మేరక బోధనేతర పనులను బహిష్కరించిన ఉపాధ్యాయులు, ఈ పనులను తమ విధుల నుంచి తొలగించాలని కోరుతూ స్థానిక ఎంఈఓ పీవీ నరసింహారావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంఈఓ నరసింహారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

- **ఆగిరిపల్లి:** ఫ్యాప్టో ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర విధులను బహిష్కరిస్తున్నామని ఆగిరిపల్లి మండల ఫ్యాప్టో కన్వీనర్లు మక్కే వేణుగోపాలరావు, కలపాల అజరయ్య తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ -1 హేబేలుకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

జి.కొండూరు: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారంతో ముగిశాయి. రెండు రోజులు నిర్వహించిన పోటీలకు మండల పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరవ్వగా 80మంది ప్రతిభ చాటిన క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు క్రీడల మండల ఇన్‌చార్జ్ పురుషోత్తం తెలిపారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు గగన్‌శ్రీ ఎంపిక

ఇబ్రహీంపట్నం: జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కళాశాలకు చెందిన కోలవనేని గగన్‌శ్రీ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ తెలిపారు. ఈనెల 4 నుంచి 7 వరకు అనంతపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ అండర్ 17 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిందన్నారు.అత్యుత్తమ ప్రతిభ చాటిన ఆమెను ఒడిశాలో డిసెంబర్ నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. ఆమెను కళాశాల కరస్పాండెంట్ నజీఫ్ పాషా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్ వలి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాగులమీరా, అధ్యాపకులు అభినందించారు.



గగన్‌శ్రీకి మెమొంటో, ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

చెకుముకి టాలెంట్ టెస్టు పోస్టర్ ఆవిష్కరణ



తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించే పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు ప్రచార పోస్టరును శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జేవీవీ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో చెకుముకి పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష రాయదలచిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలన్నారు. జేవీవీ సభ్యులు హరికృష్ణ, రాంప్రదీప్, పాపారావు, సుధాకర్, శీనయ్య పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం మైలవరం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాసన్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): అంతర్జాతీయ బాలికా దినోత్సవం కేతనకొండ ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం భవానీ మాట్లాడుతూ ప్రతి ఏటా బాలికా దినోత్సవం ఓ ప్రత్యేకతతో నిర్వహిస్తారన్నారు. ఈ ఏడాది ఇది మన సమయం, మన హక్కులు, మన భవిష్యత్ అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈసందర్భంగా పాఠశాలలో పలువురు బాలికలను ప్రత్యేకంగా అభినందించారు. వారికి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా, సీఆర్పీ డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు



తిరువూరు: తిరువూరులో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన సభ్యత్వాల నమోదు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫండ్‌కు 150 డాలర్ల విరాళాల సేకరణ, అయ్యప్ప దేవాలయానికి ఫ్యాన్ల బహూకరణ అనంతరం నాగార్జున, సిద్ధార్థ స్కూళ్లలో విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శ్రీనిధి జూనియర్ కళాశాలలో మాజీ జిల్లా గవర్నర్ కోటిరెడ్డి కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. తిరువూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని లయన్స్‌క్లబ్ సహకారంతో నిర్వహించే డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అమ్మ ప్రేమాశ్రమంలో వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, భోజనం వితరణ ఇచ్చారు. ఎన్టీఆర్ స్టేడియంలో మొక్కలు నాటారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం



ఆగిరిపల్లి: ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని ఎంఈఓ శిలారపు హేబేలు అన్నారు. ఆగిరిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన రెడ్డి వెంకటేశ్వరరావును శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి–2 కొవ్వలి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అనేక మంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు మక్కే వేణుగోపాలరావు, దాసరి విజయదుర్గ, భీమవరపు హర్షవర్ధని, పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ



ఆగిరిపల్లి: నూతనంగా నియమించిన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయని ఆగిరిపల్లి ఎంఈఓ–2 కొవ్వలి ఆనంద్ కుమార్ తెలిపారు. మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాలలో గత 8 రోజుల నుంచి రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన మండలి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 250 మంది ఉపాధ్యాయులు ఈ నెల 13 నుంచి విధుల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్య శిక్షణ మండలి అధికారి రావి అరుణ, సమగ్ర శిక్ష ఏఎంఓ రెడ్డి రామారావు, ఎస్‌సీఈఆర్‌టీ అధ్యాపకులు రవీంద్ర ప్రసాద్, విజయ్ కుమార్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై పోలీసులకు ఫిర్యాదు

నందిగామరూరల్:సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రవికిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు షేక్ ఆజాద్, ఎక్కిరాల హనుమంతరావు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి న్యాయమూర్తికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ నందిగామకు చెందిన పలువురు న్యాయవాదులు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించటం హేయమైన చర్యన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కస్తాల నూతన్, చరణ్, దున్నా కోటేశ్వరరావు, వీరబాబు, అరుణ్‌కుమార్, గోపి పాల్గొన్నారు.

గణపతికి పంచామృత అభిషేకాలు, హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై గణపతికి పంచామృత అభిషేకాలు, హోమాలు, పూజలను నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గణపతి ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో స్వామి వారికి అభిషేకాలు, గణపతి హోమం నిర్వహించగా, హోమంలో ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం ఉండ్రాళ్లను నివేదనగా సమర్పించారు. గణపతికి నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ ఈవో శీనా నాయక్ దంపతులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలపై నిర్లక్ష్యం

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- పాఠశాల ప్రాంగణాలను అద్దెకు ఇచ్చి వ్యాపారం
- అరకొర సదుపాయాల మధ్య ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ



గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో ఏపుగా పెరిగిన గడ్డి మధ్య ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టు



గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో ప్రైవేట్ వ్యక్తుల పశువుల మేతకు అద్దెకిచ్చిన స్థలంలో ఏపుగా పెరిగిన జున్ను గడ్డి

ఇబ్రహీంపట్నం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ జెడ్పీ పాఠశాలల్లోని క్రీడా ప్రాంగణాలు అధ్వానంగా మారాయి. మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు జరుగుతున్న సమయంలో క్రీడా మైదానాల్లో సరైన సదుపాయాలు లేక క్రీడల నిర్వహణ భారంగా మారింది. వివిధ పాఠశాలల్లో ఏపుగా పెరిగిన గడ్డి మొక్కల మధ్య నిర్వహించలేక ఫిజికల్ డైరెక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. అనేక పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారడంతో విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో ఏపుగా గడ్డి పెరిగింది. ఇందులోనే కొంతభాగం పశువుల మేతకు లీజుకు ఇవ్వడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. సరైన నిర్వహణ లేకపోవడంతో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా స్కూల్ ప్రాంగణాలు మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గత ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకంలో పాఠశాలలతో పాటు క్రీడా మైదానాల అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు రూ.6 కోట్లతో అభివృద్ధి చేశారు. పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. కార్పొరేట్ స్కూల్ స్థాయిలో తరగతి గదులు, టాయిలెట్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో విద్యార్థులు క్రీడలతో ఉల్లాసంగా గడిపేవారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మైదానాల్లో క్రీడలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులు, వయోవృద్ధులు, వాకర్స్ వ్యాయామానికి వచ్చి తమ ఆరోగ్యాన్ని కాపాడుకునే వారు.

కూటమి హయాంలో లీజుకు ఇచ్చిన మైదానాలు

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పాఠశాలల క్రీడా ప్రాంగణాలపై పాలకులు, అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అనేక పాఠశాలల్లో క్రీడా మైదనాలు ఏపుగా పెరిగిన గడ్డితో నిండి పోయాయి. విద్యార్థులు సాయంత్రం సమయంలో ఆడుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. వర్షాకాలంలో ఏ పాఠశాల మైదానం అయినా నీటితో నిండిపోవాల్సిందే. క్రీడా ప్రాంగణాలు వినియోగంలో లేకవడంతో విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందలేక పోతున్నారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాల ప్రాంగణం పశువుల మేత సాగుకు లీజుకిచ్చారు. జిల్లా పరిషత్ అధికారులే లీజుకు ఇచ్చారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అనేక పాఠశాలల్లో అధిక వర్షాలు, బుడమేరు వరదకు ధ్వంసమైన మైదానాలను ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేక పోవడం గమనార్హం.

రోడ్లు మెరక.. మైదానం పల్లం

గుంటుపల్లి జెడ్పీ పాఠశాలకు విశాలమైన మైదానం ఉంది. స్కూల్‌కు బయట సిమెంటు రోడ్లు నిర్మించడం వల్ల పాఠశాల మైదానం పల్లంగా మారింది. వర్షాలతో నీటితో నిండిపోయింది. నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. పాఠశాలలో కొంత మైదానం జిల్లా పరిషత్ పశువుల మేతకు లీజుకు ఇచ్చారు. వర్షాకాలంలో నీరు బయటకు పోయేలా చూడాల్సి ఉంది.

– సంధ్యారాణి, హెచ్ఎం, జెడ్పీ పాఠశాల గుంటుపల్లి

అసౌకర్యాల మధ్య ఎస్‌జీఎఫ్ గేమ్స్

పాఠశాలల్లో క్రీడా మైదానాలు సక్రమంగా లేకపోవడంతో కొండపల్లి, గుంటుపల్లి పాఠశాలల్లో అరకొర సదుపాయాల మధ్య ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఏపుగా పెరిగిన గడ్డిలో కబడ్డీ, వాలీబాల్ కోర్టులు అతికష్టం మీద ఏర్పాటు చేశారు.

పాఠశాలలోనే కొంత మైదానం పశువుల మేతకు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ లీజుకు ఇవ్వడంతో అటువైపు చూసేందుకు అవకాశం లేదు. గడ్డితో పాటు మైదానం అంతా వర్షం నీటితో నిండి ఉంది. ఏ సమయంలో ఎటువైపు నుంచి విష సర్పాలు వస్తాయో తెలియక విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.



పాఠశాల మైదానాలు అభివృద్ధి చేయాలి

పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై శిక్షణ ఇవ్వాలి. అందుకు అవసరమైన మైదానాలు అభివృద్ధి చేయాలి. పాఠశాలలో ఏపుగా పెరిగిన గడ్డిని తక్షణం తొలగించాలి. స్థానిక పంచాయతీలు, జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయించి మైదానాలు వినియోగంలోకి తేవాలి. మొక్కుబడిగా క్రీడలు నిర్వహిస్తే విద్యార్థులకు ప్రయోజనం ఉండదు.

– రెంటపల్లి వెంకటేశ్వరరావు, గుంటుపల్లి

పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

నూజివీడు: పట్టణంలోని సత్యసాయి స్కూల్ విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. దారా సుధాకర్, ఉషారాణి దంపతుల సౌజన్యంతో రాత పుస్తకాలను అందజేశారు. రాచమడుగు నారాయణ సుష్మన్, పీఎస్‌వీఎస్ రంగారావు, చిన్నం శ్రీనివాసరావు, గాదె శివరామకృష్ణ, మాడ వెంకటేశ్వరరావు, పరిశ శ్రీనివాసకుమార్, వలివేటి సుధాకర్, మునగా ధర్మేంద్ర, దారా లలిత, గుడివాడ మురళీల సౌజన్యంతో 90 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రయోజనం

పెనుగంచిప్రోలు: కేంద్రం తెచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని ఎంపీడీఓ జి. శ్రీను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జీఎస్టీ సంస్కరణలపై సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ పేరిట శుక్రవారం స్థానిక వ్యాపారస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. గూడ్స్, సర్వీస్ ట్యాక్స్ డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ ములాస్వామి, ఆఫీసర్ పి దుర్గాప్రసాద్, జీఎస్టీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీహెచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుల వివరాలను తెలిపారు. అనంతరం వ్యాపార సంస్థల వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ కె. సిద్ధారెడ్డి, డెప్యూటీ ఎంపీడీఓ కె.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

కంచికచర్ల : స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని శ్రీ బాల విఘ్నేశ్వర స్వామి ఆలయంలో కొత్తగా పాలక వర్గ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా రాయంభు శ్రీనివాసరావు, కార్యదర్శిగా మల్లాది బ్రహ్మానందరావు, కోశాధికారిగా మల్లాది పరమేశ్వరరావు, వైస్‌చైర్మన్‌గా సోమవరపు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి గుంటుపల్లి సత్యనారాయణ, సభ్యులుగా చాగుంటపాటి నాగరాజు, గుంటుపల్లి నాగరాజు, గుండెమెడ హనుమంతరావు ఎన్నికయ్యారు. వీరిని భక్తులు అభినందించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



కోటి సంతకాల కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతాప్ అప్పారావు, నాయకులు

నూజివీడు: ప్రభుత్వ రంగంలోని మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయడం అత్యంత దారుణమని, దీని ద్వారా పేదలకు వైద్యం మరింత దూరమవుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. నూజివీడులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ప్రతాప్ అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చి వాటిలో ఐదు కాలేజీలకు భవనాలను పూర్తిచేసి తరగతులు నిర్వహిస్తున్నారని, మిగిలిన కళాశాలలకు సంబంధించి భవనాల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేయడానికి రూ.6 వేల కోట్లు వెచ్చిస్తే సరిపోతుందని, ఆ పనిచేయకుండా ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. చంద్రబాబు ప్రభుత్వం చేస్తోన్న దారుణమైన పనులను ప్రజలకు తెలియజేసేందుకే కోటి సంతకాల ఉద్యమాన్ని చేపట్టామని చెప్పారు. దీనిలో భాగంగా అన్ని గ్రామాల్లో రచ్చబండ ఏర్పాటు చేసి అక్కడ ప్రైవేటు మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని ప్రజలకు తెలియజేసి, దానికి వ్యతిరేకంగా వారితో సంతకాలు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని నవంబరు 22 వరకు నిర్వహిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ముందుండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నూజివీడులోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో రూ.80 లక్షలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని నిర్మిస్తే దానిని ప్రారంభించి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం కూడా కూటమి ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నూజివీడు టౌన్, చాట్రాయి, ముసునూరు మండలాల అధ్యక్షులు శీలం రాము, పుచ్చకాయల సుబ్బారెడ్డి, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, మున్సిపల్ విభాగం అధ్యక్షులు మలిశెట్టి బాబీ, నాయకులు బసవా వినయ్, షేక్ గబ్బర్, బెజవాడ శ్రీహర్ష, కవులూరి యోగి, నండూరు భాస్కరశర్మ, కాలి సుగుణరావు, అత్తి మురళి, కంచర్ల లవకుమార్, పిళ్లా చరణ్, ముల్లంగి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 22 వరకు సంతకాల సేకరణ

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ వాల్ పోస్టర్‌ను మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు మండల, గ్రామ స్థాయిలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ తదితర పేద వర్గాల వారికి వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలు మంజూరు చేయించి కొన్ని నిర్మాణాలు చేపట్టారన్నారు. సీఎం చంద్రబాబు తన అనుయాయులకు పీపీపీ పద్ధతిలో కట్టబెట్టేందుకే ప్రైవేట్ విధానం తీసుకొచ్చారని విమర్శించారు. వివిధ విభాగాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జోగి రమేష్, నాయకులు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు రామిరెడ్డి



తిరువూరులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రామిరెడ్డి, నాయకులు

తిరువూరు: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు కూటమి చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు తంగిరాల రామిరెడ్డి అన్నారు. తిరువూరులో శుక్రవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడానికి, ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు కళాశాలలను అప్పగించడానికి కూటమి ప్రభుత్వంలోనీ సీఎం చంద్రబాబు నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతి ఒక్క పౌరుడూ ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ తిరువూరు మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్, తిరువూరు, ఎ.కొండూరు జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, భూక్యా గన్యా, నాయకులు నరెడ్ల వీరారెడ్డి, కాలసాని గోపాల నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్సతో మానసిక రుగ్మతలకు చెక్



సదస్సులో మాట్లాడుతున్న రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అనూష

నూజివీడు: శారీరక వ్యాధులకు ఎలాగైతే వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స చేయించుకుంటామో మానసిక వ్యాధులకు సైతం మానసిక వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవడం ద్వారా స్వస్థత చేకూరుతుందని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ. అనూష అన్నారు. ప్రపంచ మెంటల్ హెల్త్ డే సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానసికంగా బలహీనంగా ఉన్న వారు మానసిక రుగ్మతలకు గురవుతారన్నారు. మానసిక వైద్యుల నిపుణులు కోమలి మాట్లాడుతూ ప్రతి సోమవారం నూజివీడు ఏరియా ఆస్పత్రిలో మానసిక వైద్యులు అందుబాటులో ఉంటారని, ఎవరైనా మెంటల్ హెల్త్ కండీషన్‌లో లేనివారు వచ్చి చికిత్స పొందవచ్చన్నారు. సకాలంలో వైద్యసాయం పొందితే మానసిక వ్యాధుల బారి నుంచి బయట పడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం

సూర్యనారాయణరెడ్డి విమర్శ



సూర్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న పట్టణ నాయకులు

విస్సన్నపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక పుట్రేల రోడ్డులోని మామిడికాయ మార్కెట్ వద్ద వైఎస్సార్ సీపీ పట్టణ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలలో కోతలు విధిస్తూ సూపర్ సిక్స్ హిట్ అంటూ కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డిని పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు సిరసాని ప్రకాష్, ముంగా జయరాజు, జి మల్లయ్య, పల్లెపాం లక్ష్మయ్య, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?



చాట్రాయి సెంటర్‌లో కోతకు గురైన ఆర్అండ్‌బీ రోడ్డు



గొల్లగూడెం ఆర్అండ్‌బీ రోడ్డుపై పడిన గుంత

చాట్రాయి: గుంతలు పడిన ఆర్అండ్‌బీ రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రోడ్లపై పడిన గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో ఎంత లోతు ఉందో తెలియక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. చాట్రాయి సెంటర్ నుంచి గొల్లగూడెం వెళ్లే రోడ్డు వర్షాలకు కోతకు గురైంది. చాట్రాయి గొల్లగూడెం రోడ్డుకు మూడు నెలల కిందట మరమ్మతులు చేసినా మూణ్ణాల ముచ్చటగా మారింది. దీంతో ఈ రోడ్డుపై భారీగా పడిన గుంతల్లో లోతు తెలియక సోమవారం రాత్రి ఓ వ్యక్తి గుంతలో పడిపోవడంతో గాయాలయ్యాయి. అదే రోజు రాత్రి జనార్దనవరం గ్రామానికి చెందిన దుర్గం పుల్లారావు వాహనం గోతిలో పడి దెబ్బతింది. చాట్రాయి నుంచి బూరుగుగూడెం వెళ్లే రోడ్డులో వికాస్ పబ్లిక్ స్కూల్ వద్ద పడిన పెద్ద గుంతతో ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా సమస్యలపై త్వరలో ఆన్‌లైన్ పోర్టల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళల సమస్యల సత్వర పరిష్కారానికి త్వరలో ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్, ఏపీ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాలలో శుక్రవారం స్పాట్ లైట్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మాట్లాడుతూ బాలికా దినోత్సవాలు అంటూ ఒక్క రోజు జరుపుకోవడం కాదని, ఏడాది మొత్తం అవగాహన సదస్సులు జరుపుకొన్నప్పుడే అద్భుత ఫలితాలు సాధించగలమన్నారు. తద్వారా సమాజంలో సైతం మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలికలు, మహిళలు చదువుకునే సమయంలో, ఉద్యోగ విధుల్లో ఉన్న సమయంలో ఎటువంటి భయం లేకుండా జీవితం కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలు, బాలికలు స్వయంగా తమ కార్యాలయానికి రాలేని పరిస్థితులు ఉండటం, మరొక సందర్భంలో తమ వివరాల గోప్యత వంటి విషయాలను గుర్తించి ఆన్‌లైన్ పోర్టల్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. మార్పు ట్రస్ట్ చైర్‌పర్సన్ ఆర్.సూయజ్ రాయపాటి శైలజతో ముఖాముఖి నిర్వహించారు. మహిళలపై నేడు జరుగుతున్న అఘాయిత్యాలు, సోషల్ మీడియా వేదికగా వేధింపులు ఇలా పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు రాయపాటి శైలజ సమాధానాలు చెప్పారు.

ఆక్రమణల చెరలో పేదల చెరువు



చింతలవల్లిలో నాగళ్ల రామయ్యకుంటను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

ముసునూరు: ఎస్సీ, బీసీ వర్గాల పేదలకు చెందిన చెరువును అధికార పార్టీ వర్గాలు కబ్జా చేయడంపై నియోజకవర్గ సీపీఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలవల్లికి చెందిన నాగళ్ల రామయ్యకుంటను సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ బాధిత పేదలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నరసింహ మాట్లాడుతూ పూర్వం గ్రామానికి చెందిన నాగళ్ల రామయ్య తన భూమిలో సొంత నిధులతో చెరువు తవ్వించి, గ్రామస్తులందరి అవసరాల కోసం వితరణగా ఇచ్చారని, నాటి నుంచి నేటి వరకు దాత పేరుతోనే కొనసాగుతూ అందరికీ ఉపయోగ పడుతోందన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు కబ్జాదారులు ఇటీవల రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకుని, చెరువు యజమానులుగా ఆన్‌లైన్‌లో తమ పేర్లను గుట్టుచప్పుడు కాకుండా నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. దాతకు గానీ, ఆయన వారసత్వానికి గానీ, సంబంధం లేని వ్యక్తులు చెరువు తమదేనంటూ తెరపైకి రావడంపై నేతలు, బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి, బాధిత పేద వర్గాలకు న్యాయం చేయకపోతే, వారితో కలిసి ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.



వాడీవేడిగా తిరువూరు కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు పాల్గొన్న ఈ సమావేశానికి తెలుగుదేశం కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మొత్తం 15 అంశాలతో ప్రవేశపెట్టిన సమావేశ అజెండాలో పలు అంశాలను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వ్యతిరేకించడంతో వాటిపై ఎటువంటి చర్చ జరపకుండానే రద్దు చేశారు. తిరువూరు పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు రూ.18.20 లక్షలు నగర పంచాయతీ నిధుల నుంచి కేటాయించేందుకు చేసిన ప్రతిపాదనను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గుమ్మా వెంకటేశ్వరి, తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు తదితరులు వ్యతిరేకించారు. ఇప్పటికే ఐదేళ్లుగా కాంట్రాక్టరు ఈ పనులు నిర్వహిస్తుండగా, నిర్మాణ దశలోనే భవనం బీటలు వారిందని, దీనికి అదనంగా నిధులు కేటాయించినా ప్రయోజనం లేదని కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. సభ్యుల నుంచి వ్యతిరేకత రావడంతో ఈ ప్రతిపాదనను రద్దు చేస్తూ, భవన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరాలని తీర్మానించారు. తిరువూరు పట్టణంలో దెబ్బతిన్న తాగునీటి వనరులు, మోటార్ల మరమ్మతులకు రాష్ట్ర ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల నుంచి కేటాయించిన రూ.20 లక్షలు ఖర్చు చేయడానికి చేసిన ప్రతిపాదనను కూడా సభ్యులు వ్యతిరేకించారు. గతంలోనే ఈ పనులకు నగర పంచాయతీ సాధారణ నిధి నుంచి ఖర్చు చేసినందున ఆమోదం తెలపకుండా వాయిదా వేశారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

స్థానిక సమస్యలు వదిలి రాష్ట్ర స్థాయి అంశాల ప్రస్తావన...

తిరువూరు పట్టణంలో రహదారులకు మరమ్మతులు చేయాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమావేశంలో ప్రతిపాదించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మీరేం చేశారంటూ ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేయడంపై కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గ అభివృద్ధి నిధులను కేటాయించి రహదారులు అభివృద్ధి చేయాలని కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూజివీడు: నూజివీడు డివిజన్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సమావేశాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్, సెక్రటరీ ప్రమోద్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా గుండుబోయిన వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా రవికిరణ్‌సింగ్, కార్యదర్శిగా అశోక్ కుమార్, మరో 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



జి.కొండూరు: మైలవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ అన్నపురెడ్డి కోటిరెడ్డి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. విద్యార్థినులకు లక్ష్య నిర్దేశం, కార్యాచరణ, విజయం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బ్యూలా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

– నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ



నూజివీడు: మహిళా సంరక్షణ కార్యదర్శులు తాము పనిచేసే ప్రాంతంలో నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలని నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం మహిళా సంరక్షణ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో నిఘా పెట్టి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలన్నారు. ముందస్తు సమాచారం సేకరించడం వల్ల అసాంఘిక కార్యకలపాలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలను అడ్డుకోవడానికి వీలవుతుందని చెప్పారు. ముందస్తుగానే సమాచారాన్ని సేకరించడం ద్వారా నేరాలు జరుగకుండా అడ్డుకోవచ్చన్నారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ జ్యోతిబసు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ ప్రారంభం



నూజివీడు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబులను మార్చిన నేపథ్యంలో ప్రజలకు కలిగే లబ్ధి గురించి అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు సూజర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న పేర్కొన్నారు. పట్టణంలోని అమర్‌భవన్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా దానిని సబ్ కలెక్టర్ ప్రారంభించారు.ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషీన్‌లు, టీవీలు తదితర వాటికి గతంలో ధర ఎంత, తగ్గిన ధర ఎంత అనే వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులపై గతంలో 28 శాతం జీఎస్టీ విధించేవారని, ఇప్పుడు దానిని 18 శాతానికి తగ్గించిన నేపథ్యంలో ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గాయన్నారు.



















